# 14. అంతరాత్మ ఘోష

'నేను' అంటే ఎవరు? నా శరీరమా? శరీరంలోని ఆత్మా? నా వ్యక్తిత్వమా? నా శక్తిసామర్థ్యాలా? నాఅభిరుచులా? నా శరీరమైతే దాన్ని ఇతరశక్తుల నుండి ఎందుకు కాపాడుకోలేకపోతున్నాను? నా ఆత్మయితే దాన్ని దేహంనుండి బయటికి పోకుండా ఎందుకు నిరోధించలేకపోతున్నాను? నా వ్యక్తిత్వమైతే దాన్ని ఎందుకు రక్షించుకోలేకపోతున్నాను? నా శక్తిసామర్థ్యాలైతే అవి నిర్వీర్యం కాకుండా వాటికి రక్షణ ఎందుకు కల్పించలేకపోతున్నాను? నా అభిరుచులైతే వాటిని నేనెందుకు పూర్తిగా నెరవేర్చుకోలేకపోతున్నాను? ఈ సువిశాల విశ్వంలో నా స్థానం ఏమిటి? నేనెక్కడ్నుంచి వచ్చాను? తిరిగి ఎక్కడికి వెళ్ళాలి? అక్కడ నా పరిస్థితి ఏమిటి? నన్ను కంట్రోల్‌చేసే రిమోట్ కంట్రోల్ ఏదైనా ఉందా ఈ లోకంలో?

ఇలా ప్రశ్నించుకుంటూపోతే ఈ ప్రశ్నలకు ఓ అస్పష్టమైన సమాధానం లభిస్తుంది. అదే 'దేవుడు.' ఈ నిఖిలజగతిని, ఇందులోని సమస్తాన్ని దేవుడే సృష్టించాడా? యావత్ సృష్టిరాసుల్ని ఆయనే కంట్రోల్ చేస్తున్నాడా? మన కష్టసుఖాలకు ఆయనే మూల కారకుడా? మన జీవన్మరణాలు ఆయన అధీనంలోనే ఉన్నాయా? ఆయన మన మొరలు ఆలకిస్తాడా?

## మహర్షులే మనకు మార్గదర్శులు

ఈప్రశ్నలకు మన అంతరాత్మ సహజంగానే ఔనని సమాధానమిస్తుంది. అంతేకాదు ఆ విశ్వకర్తకు, మనకు మధ్య అవినాభావ సంబంధం కూడా ఉంటుందని మన అంతరాత్మ ఘోషిస్తుంది. అయితే ఆ సంబంధం ఏమిటి? దాన్ని మనకు తెలిపేవారెవరు? సదాచార సంపన్నులైన మహర్షులే దీన్నిగురించి మానవాళికి తెలియజేయగలరని చరిత్ర చెబుతుంది.

ఆ మహర్షులు విశ్వప్రభువు పంపిన అమృతకలశాన్ని అశాంతితో అలమటిస్తున్న మానవుల హృదయాలపై చిలికించి వారి సేద తీర్చారు. ఆ మహర్షుల్లోని అంతిమ మహర్షియే మహనీయ ముహమ్మద్ (స). ఆ అమృతకలశాల్లోని అంతిమ అమృత భాండమే ఖుర్ఆన్. ముహమ్మద్ (స)పై దిగిన ఈ వాణి అజ్ఞానాంధకారంలో తచ్చాడుతూ ఉండిన కోట్లాది మానవులకు జ్ఞానకాంతి ప్రసాదించి వారి జీవితాల్ని సమూలంగా సంస్కరించింది; ఇది ప్రళయంవరకు సంస్కరించగల ఏకైక కరదీపిక.

## గత గ్రంథాలు

ఖుర్ఆన్ ప్రకారం ప్రతియుగంలో, ప్రతిదేశంలో, ప్రతిజాతిలో మానవులకు రుజుమార్గం చూపడానికి, జీవితసత్యాలు బోధించడానికి నిస్వార్థపరులు, నిష్కల్మషులైన మహర్షులు వచ్చారు. వారిని దైవప్రవక్తలంటారు. వారిపై దివి నుండి దైవగ్రంథాలు



అవతరించాయి. జబ్బూర్, తౌరాత్, ఇంజీల్ వగైరా ఈ కోవకు చెందినవే. (ఇవిప్పుడివి బైబిల్‌గా రూపాం తరం చెందివున్నాయి.) ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడని మతగ్రంథాలు కూడా ప్రారంభ కాలంలో దైవప్రోక్తగ్రంథాలే అయివుండవచ్చు. కాదని ఖండించడానికి ఆస్కారమేదీ కన్పించదు.

అయితే పూర్వం దైవగ్రంథం అవతరించిన కొంతకాలంవరకే వాటి బోధనలు సురక్షితంగా వుండేవి. ఆ తర్వాత స్వార్థపరులు, వాటిని మార్పులకు, చేర్పులకు గురిచేసేవారు. తిరిగి దేవుడు మానవుల్ని వెలుగుబాటపై నడిపించడానికి మరో దివ్యగ్రంథాన్ని పంపేవాడు. ఇలా గతగ్రంథం మార్పులకు చేర్పులకు గురై ప్రజలు రుజుమార్గం తప్పిపోయి నప్పుడల్లా దేవుడు మరోగ్రంథం పంపుతూ, అనాది నుండి నేటివరకు 1,24,000 మంది దైవప్రవక్తల ద్వారా ఎన్నో గ్రంథాలు అవతరింపజేసాడు. చివరిసారిగా ముహమ్మద్ ప్రవక్త (స) ద్వారా ఖుర్ఆన్‌ని అవతరింపజేశాడు.

ఈ గ్రంథాలన్నిటి సారాంశం ఒక్కటే. సృష్టికర్త, సర్వేశ్వరుడు, ప్రభువు, పర్యవేక్షకుడు, ఆపద్బాంధవుడు, ఆపదల మొక్కులవాడైన దేవుడు మాత్రమే ఆరాధనకు అర్హుడు. ఆయన తప్ప మరోఆరాధ్యుడు లేడు; సమస్త జీవనరంగాల్లో ఆయన ఆజ్ఞల్నే పాటించాలి; ఆయన దైవత్వంలో, గుణగణాల్లో, శక్తిసామర్థ్యాలలో ఇతరుల్ని భాగస్వాములుగా చేయకూడదు. ఈ ప్రపంచం ఓ ప్రయాణమజిలి, పరీక్షావేదిక, తాత్కాలికాశ్రయం. మరణానంతరం ప్రతి మనిషీ తన కర్మలకు దైవన్యాయస్థానంలో లెక్క చెప్పుకోవలసి వుంటుంది. కర్మవిచారణ తర్వాత స్వర్గం లేదా నరకం రూపంలో అతనికి శాశ్వత ప్రతిఫలం లభిస్తుంది.

ఇవీ ఆ గ్రంథాల్లోని మౌలికబోధనలు. ఈ బోధనలు గల ధర్మాన్నే 'ఇస్లాం' అంటారు. తొట్టతొలి దైవప్రవక్త (ఆదిమానవుడు) ఆదం(అలై) నుండి చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్ (స) వరకు ప్రవక్తలంతా ఇస్లాంధర్మాన్నే మానవులకు బోధిస్తూ వచ్చారు.

కాని ఈ బోధనలు ఈనాడు ఖుర్ఆన్‌లో తప్ప మరే మతగ్రంథాల్లో పూర్తిగా కానరావు. ఈ గ్రంథాలలో ఏకదైవారాధనతో పాటు త్రిత్వం, బహుదైవారాధనలు కూడా చోటుచేసుకున్నాయి. అసాధారణ శక్తిసంపన్నుడైన దేవునికి మానవబలహీనతలు ఆపాదించబడ్డాయి, ఆరాధనాభావం ప్రార్థనామందిరాలకు పరిమితమైపోయింది. సమానత్వం, సాంఘికన్యాయాలకు తూట్లుపడ్డాయి. పునర్జీవం పునర్జన్మగా మారింది. మరణానంతర జవాబుదారీ భావన మటుమాయమైపోయింది. దైవప్రోక్తవిషయాలు మానవకల్పితాలతో కలుషితమైపోయాయి.

## కారుచీకటిలో కాంతిరేఖ

ఈ కారణంగానే దేవుడు ఈ కలియుగంలో కట్టకడపటి మార్గదర్శినిగా ఖుర్ఆన్‌ని పంపాడు. దీన్ని మానవాళికి అందజేసిన మహర్షి ముహమ్మద్ (స) చిట్టచివరి దైవప్రవక్త.

నలభై ఏళ్ళ ప్రాయంలో ఆయన్ని దేవుడు తన ప్రవక్తగా నియమించాడు. దానికి పూర్వం అవినీతి, అశ్లీలం, మద్యసేవనం, వ్యభిచారం, అన్యాయం, దగా, దోపిడి, దౌర్జన్యాలతో నిండిన ఆనాటి అరబ్బుసమాజంలో ఆ మహనీయుడు రాళ్ళకుప్పలో రత్నంలా, కారుచీకటిలో కాంతిరేఖలా ఎంతో పవిత్రజీవితం గడిపారు. వ్యాపారలావాదేవీలతో పాటు సమస్తవ్యవహా రాల్లో ఆయన అసామాన్య నీతీనిజాయితీలు ప్రదర్శించి అరబ్బులలో 'అమీన్' (నిజాయితీ పరుడు)గా, 'సాదిఖ్' (సత్యసంధుడు)గా ప్రసిద్ధిచెందారు.

అందువల్లనే ఆయన దేవుడు తనను ప్రవక్తగా నియమించి తన దగ్గరికి దివ్యసందేశం పంపుతున్నాడని ప్రకటించినప్పుడు ఆయన గతచరిత్ర ఎరిగినవారిలో మంచిని ప్రేమించే వారంతా ఆయన మాటలు నమ్మి తమ జీవితాలు సంస్కరించుకున్నారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో నడచుకుంటూ వారు యావత్తు అరేబియాను నైతిక నందనవనంగా తీర్చి దిద్దారు. ఆయనపై అవతరించిన ఖుర్ఆన్ అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసింది. చివరికి ఒక స్త్రీ ఆపాదమస్తకం ఆభరణాలు ధరించి రెండు చేతులతో బంగారాన్ని ఎగరేస్తూ, ఒక్క దేవుని భయం తప్ప మరెవరి భయం లేకుండా ఒంటరిగా సనా నుండి హజ్రమౌత్‌కు ప్రయాణం చేయగలిగిందంటే అది ఖుర్ఆన్ మహత్యమే.

## దైవవాణియా, మానవవిరచితమా?

ఇంతకూ ఖుర్ఆన్ దైవవాణియా లేక దైవికప్రేరణ ద్వారా ఉనికిలోకి వచ్చిన మానవ విరచితమా? దైవవాణి అయితే అది నేడు మనదాకా సురక్షితంగా చేరిందా లేక ఏవైనా మార్పులకు లోనయిందా? ఈ అనుమానాలు నివృత్తిఅయి, ఖుర్ఆన్ సాక్షాత్తు దైవవాక్కే అని, అది సురక్షితంగా మనదాకా చేరిందని ధృవపడినప్పుడే మనకు దానిమీద నమ్మకం కుదురుతుంది. న్యాయబద్ధంగా ఆలోచించినా, చారిత్రకదృష్టితో వీక్షించినా ఖురాన్ విషయంలో లభించేటంతటి గట్టి ప్రామాణికత, చారిత్రకఆధారాలు మరే మతగ్రంథం విషయంలో లభించవు. అలాగే ముహమ్మద్ ప్రవక్త (స) జీవితవిశేషాల్ని గురించి కూడా పటిష్ఠమైన ఆధారాలున్నాయి. ఆయన జీవితాన్ని ప్రత్యక్షంగా చూసి, ఆయన అమృత ప్రవచనాలు ఆస్వాదించిన అనుచరుల జీవితవిశేషాల్ని గురించి, ఆ అనుచరుల ద్వారా ప్రవక్త జీవితవిశేషాలు సేకరించిన వ్యక్తుల జ్ఞాపకశక్తి, గుణగణాలను గురించి కూడా గట్టి ఆధారాలున్నాయి.

ఖుర్ఆన్ దైవవాణియా, మానవకల్పితమా అనే విషయంలో మచ్చుకు దైవప్రవక్త (స) జీవితకాలంలోని రెండు సంఘటనల్ని గురించి ముందుగా తెలుసుకుందాం.

యమన్‌కు చెందిన గొప్పమేధావి, ప్రముఖ కవి, దౌసీతెగ నాయకుడు తుఫైల్ దౌసీ హజ్‌యాత్ర కోసం మక్కా వస్తున్నాడని ఓసారి సత్యవిరోధులకు తెలిసిపోయింది. వెంటనే వారు పట్నం బయటే అతడ్ని కలుసుకొని, ముహమ్మద్ మహనీయుని (స)కి, ఖుర్ఆన్‌కు



వ్యతిరేకంగా అతనికి బాగా నూరిపోశారు. ముహమ్మద్ చెప్పే మాయమాటలు వింటే మనిషి మార్గభ్రష్టుడవుతాడని బెదరగొట్టారు.

వారి దుర్బోధ విన్న దౌసీ నిజమే అనుకొని ముహమ్మద్ (సల్లం) వైపు కన్నెత్తి కూడా చూసేందుకు సాహసించలేదు. కాబాలో ముహమ్మద్ ప్రవక్త (స) ఖుర్ఆన్ పఠిస్తుంటే, దౌసీ కాబాప్రదక్షిణ చేస్తూ ఆ వాణి తన చెవులకు సోకకుండా ఉండేందుకు చెవుల్లో దూది పెట్టుకున్నాడు. అయితే ఎలాగో ఖుర్ఆన్ వాక్యమొకటి అతని చెవిలో పడింది. కాని అందులో మక్కానాయకులు చెప్పినట్లు చెడేమీ లేదు. అంచేత అతను రెండుక్షణాలు ఆగి ఆ వాణిని కాస్త జాగ్రత్తగా ఆలకించాడు. దాంతో అతని హృదయం మీది అపోహ పొరలు తొలగిపోయాయి. అతను పునరాలోచనలో పడిపోయాడు.

తాను మేధావి, కవి. తనకు మంచిచెడులు, సత్యాసత్యాలను విచక్షణచేసే జ్ఞానం, ఉన్నతంగా ఆలోచించే మేధ వున్నాయి. అలాంటప్పుడు ఆయన మాటలు ఎందుకు వినకూడదు? మంచి మాటలైతే సరే, మంచివి కాకపోతే త్రోసిపుచ్చవచ్చు. ఈ ఆలోచనతో తుఫైల్ దౌసి దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పారాయణం ముగించి వెళ్ళిపోయాక ఆయన వెనకాలే నడచి ఆయన ఇంటికి చేరుకున్నాడు. అక్కడ తనను తాను పరిచయం చేసుకొని తానొచ్చిన ఉద్దేశ్యం తెలిపాడు. దైవప్రవక్త (స) అతడ్ని ఆదరించి ఖుర్ఆన్‌లోని కొన్ని సూక్తులు విన్పించారు. అంతే, అతని మానసాకాశం ప్రకాశవంతమయింది. మనసారా సత్యధర్మం స్వీకరించి సంతోషంగా వెళ్ళిపోయాడు.

నజ్రాన్‌కు చెందిన ఓ క్రైస్తవవర్గం యదార్థం ముందుకు వచ్చినా కేవలం ప్రాపంచిక ప్రయోజనాలు వదలుకోలేక సత్యాన్ని స్వీకరించలేదు. అయితే తమ మతగ్రంథంలో అంతిమదైవప్రవక్త గురించిన భవిష్యత్‌ప్రకటనలు చదివి వున్నందున ముహమ్మద్ (స) దైవప్రవక్తేనని, గ్రహించింది. "మన ఉభయుల్లో అసత్యవాదులెవరో వాళ్ళను దేవుడు నాశనం చేయుగాక అని మనం మనభార్యాపిల్లల్ని తీసుకొని ప్రమాణంచేద్దాం రండి" అని ఆయన (స) పిలిచినపుడు ఈ కారణంగానే వారు ప్రమాణం చేయడానికి వెనుకంజవేశారు.

## ఖుర్ఆన్ ఛాలెంజ్!

ఖుర్ఆన్‌లోని భాషాశైలిని, విషయతీరును గమనిస్తే, ఇది తప్పక దైవవాణేనని మన అంతరాత్మ ఘోషిస్తుంది. కనుక ఖురాన్‌సూక్తుల్ని పరిశీలించి ఆలోచించమని దేవుడిలా చెబుతున్నాడు: "వారు ఖుర్ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ వద్ద నుండి గాక మరెవరి వద్ద నుండో వచ్చివుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా!" (4:82)

దైవభీతి, పరలోకచింతనల ప్రవృత్తి కలవారిని కదలించడానికి ఇలాంటి సూక్తులెన్నో ఉన్నాయి ఈ గ్రంథంలో. ప్రపంచపూజారుల్ని గురించి, అంతరాత్మ ప్రబోధనను అణచి

పెట్టినవారిని గురించి మనం ఏమీ అనలేం. అలాంటివారి ముందు ఎన్ని ప్రమాణాలు వచ్చినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే. కాకపోతే ఈ గ్రంథం దైవవాణియా కాదా అని అనుమానంలో పడేవారికి ఖుర్‌ఆన్ ఇలా ఒక సవాలు విసరుతోంది:

"ఒకవేళ మా దాసునిపై అవతరింపజేసిన ఈ గ్రంథం పట్ల మీకేదైనా అనుమాన ముంటే ఇందులో ఉన్నటువంటి ఓఅధ్యాయం రచించి తీసుకురండి. ఈపని కోసం ఒక్క దేవుడ్ని వదలి మీ సహాయకులందర్నీ పిలుచుకోండి. మీరు సత్యమంతులైతే ఈ పనిచేసి చూపండి. మీరీ పని చేయలేకపోతే....ఎంత మాత్రం చేయలేరు... మనుషులు, పాషాణాలు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్యతిరస్కారుల కోసం అది సిద్ధపరచబడిఉంది." (2:23)

ఈ సవాలును ఈనాటికీ ఎవరూ ఎదుర్కోలేకపోయారు. దైవప్రవక్త (స) కాలంలో గొప్పగొప్ప కవులు, రచయితలు దీన్ని ఎదుర్కోలేక చేతులెత్తేశారు. ఓసారి కావ్యపూర్ణం కోసం 'కౌసర్' అధ్యాయంలోని మొదటిసూక్తిని ఓ చర్మపుపొరపై రాసి కాబాగోడకు వ్రేలాడదీశారు. దాన్ని పూరించడానికి చాలామంది కవులు ప్రయత్నించారు. కాని ఒక్కరూ కావ్యపూర్ణం చేయలేకపోయారు. ఆతర్వాత ఆ అధ్యాయం పూర్తిగా అవతరించింది. దాన్ని చూసి ఆ కవులు సిగ్గుతో తలలు దించుకొని, ఇది మానవరచన ఎంతమాత్రం కాదని గ్రహించారు.

క్రీ.శ.727లో కొందరు సత్యవ్యతిరేకులు ఖుర్‌ఆన్ లాంటిదే మరోగ్రంథం రచించాలని పథకంవేశారు. ఈ పనికి వారా కాలంలో గొప్పపండితుడిగా ప్రసిద్ధిచెందిన ఇబ్నుల్‌మఖ్ఫా అనే వ్యక్తిని సంప్రదించారు. అతను ఓ ఏడాదిలోనే పని పూర్తిచేస్తానని వారికి హామీనిచ్చి రచనాకార్యానికి ఉపక్రమించాడు. ఆర్నెల్ల తర్వాత వారు పని ఎంతవరకు వచ్చిందోనని చూడటానికి అతని దగ్గరకు వెళ్ళారు. అప్పుడతను చేతిలో కలం, కాగితాలు పట్టుకొని దీర్ఘాలో చనలో మునిగివున్నాడు. అతనిముందు రాసి చించేసిన కాగితాలు గుట్టలుగుట్టలుగా పడివున్నాయి. కాని ఆ రచయిత ఖుర్‌ఆన్‌ని పోలిన ఒక్కవాక్యం కూడా రాయలేకపోయాడు. చివరికతను తన అసమర్థతకు సిగ్గుపడుతూ రచనాబాధ్యత నుండి తప్పుకున్నాడు. (Mohammad, His life and Doctrine P.143, by Wollaston)

గతశతాబ్ది చివరిలో జర్మనీలోని మ్యూనిచ్ యూనివర్శిటీకి చెందిన ఓ సంస్థ ముస్లిం జగత్తులోని వివిధప్రాంతాల నుండి హిజ్రీ 1వ శతాబ్ది నుండి 14వ శతాబ్దివరకు వివిధ కాలాల్లో రాయబడిన 42వేల వ్రాత, ముద్రిత ప్రతుల్ని సేకరించింది. వాటిపై 50 ఏళ్ళ పాటు సుదీర్ఘపరిశోధన జరిపి, చివరికి ఈ ప్రతుల్లో అచ్చుతప్పులు తప్ప ఎలాంటి తేడా లేదని తన నివేదికలో ప్రకటించింది.



## ఇతివృత్తం

ఈ గ్రంథం మనిషిని దైనందిన జీవిత వ్యవహారాల నుండి ఏకాంత కుహరాల్లోకి తీసికెళ్ళి తాత్విక చింతనను నూరిపోసే తత్వశాస్త్రం కాదు. ఇది దేవునికి, దాసునికి మధ్య ఉండవలసిన వాస్తవిక సంబంధాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని, దానికి తగిన బలం చేకూర్చేందుకు కావలసిన ఇతర అంశాలను ఉప విషయాలుగా పేర్కొంటుంది. అందువల్ల ఇందులో జీవిత సమస్యలకు సంబంధించిన సమస్త విషయాలు కనిపిస్తాయి.

ఇది సామాజికశాస్త్రం కాకపోయినా, ఇందులో సత్సమాజ స్థాపనకు అవసరమైన సాంఘికన్యాయం, సభ్యతాసంస్కృతులు, కౌటుంబిక విషయాలున్నాయి. ఇది నీతులు వల్లించే నీతిశాస్త్రం కాకపోయినా ఇందులో మానవుల్ని నీతిమంతులుగా తీర్చిదిద్దడానికి కావలసిన ఉన్నత నైతికనియమావళి ఉంది. ఇది ఆర్థికసమస్యల్ని పరిష్కరించే అర్థశాస్త్రం కాకపోయినా ఇందులో ధనార్జన, ధనవినియోగాలను గురించి చర్చించి ఆర్థికన్యాయానికి రాచబాట నిర్మిస్తుంది. ఇది రాజకీయశాస్త్రం కాకపోయినా రాజనీతి, పరిపాలన, యుద్ధం, సంధి, అంతర్జాతీయ సంబంధాలు మొదలైన రాజకీయ వ్యవహారాలను కూడా స్పృశిస్తుంది.

## సమగ్ర జీవిత సంవిధానం

ఇది జీవితానికి సంబంధించిన సకల రంగాల్లో దైవహితవుల్ని మానవుల ముందు పెట్టి, వాటి విషయంలో మరణానంతరం దేవునిముందు బాధ్యత వహించవలసి వుంటుందని అడుగడుగునా అతడ్ని హెచ్చరించే, ఉపదేశించే విశిష్ట గ్రంథరాజం.

కనుక ఈ ఆశయం నెరవేరాలంటే, విద్యార్థి తన పాఠ్యగ్రంథం పఠిస్తున్నట్లు ఈ గ్రంథాన్ని నిత్యం పఠిస్తుండాలి. ఈ కారణంగానే దీనికి 'ఖుర్‌ఆన్' అని పేరొచ్చింది. అంటే పాఠ్య గ్రంథం, పఠనగ్రంథం అన్నమాట. ఈ భావంలో దీన్ని పఠణవేదమని కూడా చెప్పవచ్చు. హిందూమత గ్రంథాల్లోని కొన్ని భవిష్యత్ ప్రకటనల్ని పరిశీలిస్తే, వాటిలో ప్రస్తావించబడిన పఠణవేదం ఖుర్‌ఆనే అయి ఉండవచ్చన్న అనుమానం కూడా కలుగుతుంది.

ఖుర్‌ఆన్ మానవులందరి ఉమ్మడిసొత్తు. దీనిపై ఏ ఒక్క జాతికీ, వర్గానికీ గుత్తాధిపత్యం లేదు. గాలి, నీరు, సూర్యరశ్మి మొదలైన ప్రకృతివనరుల్ని మానవులంతా ఎలా వినియో గించుకొని ప్రయోజనం పొందుతున్నారో ఖుర్‌ఆన్‌వల్ల కూడా అలాగే ప్రయోజనం పొంద వచ్చు. అంచేత సత్యాన్ని ప్రేమించి, మోక్షాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఆలోచించి కనీసం ఒక్క సారైనా దీన్ని అధ్యయనంచేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.